విదేశీ మారక ద్రవ్యానికి ఆక్వా దోహదం

విశాలాంధ్ర - కాకినాడ : ఆక్వారంగం ద్వారానే అధిక ఆదాయం వస్తుందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. విదేశీ మారకద్రవ్యంను తీసుకొచ్చే పలు రంగాల్లో ఆక్వా రంగం ఒకటని ఆమె చెప్పారు. శనివారం కాకినాడలోని ఎస్సార్ఎంటి ఫంక్షన్ హాల్లో 22వ ఆక్వా టెక్నో 2023వ కార్యక్రమాన్ని ఎంపీ గీత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గీత మాట్లాడుతూ ఆక్వా రంగంపై సుమారు 16 లక్షల మంది మన రాష్ట్రంలో ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. ఆక్వా ఎగుమతి ఉభయగోదావరి జిల్లా నుంచే అధికంగా జరుగుతోందని ఇది చాలా గర్వంగా ఉందన్నారు. కరోనా సమయంలో ఆక్వా రైతు నష్టపోకుండా సీఎం జగన్ సహకరించి వారిని నష్టాల పాలు కాకుండా గట్టెక్కించారన్నారు. ఆక్వా రంగానికి అవసరమైన విద్యుత్, మందులు, ఫీడింగ్ వంటివి ఈ ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. చెరువులలో క్రిమి రసాయనిక మందులు వినియోగించకుండా మేలైన చేపలు, రొయ్యలను పెంచి ప్రజల ఆరోగ్యానికి కాపాడాలని ఆమె కోరారు. రొయ్యలు తినడం అలవాటు చేసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, నిర్వాహకుడు కే జోసఫ్, బలసాడి రంగారావు వివిధ కంపెనీల యజమానులు, రైతులు, ఆక్వా రంగంలో అధిక దిగుబడి సాధించిన రైతులను సన్మానించారు.

ఆదిత్యలో 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలోని ఆదిత్య విద్యా సంస్థలకు సంబంధించిన డ్రైవర్లకు, విద్యార్థులు జిల్లా ట్రాన్స్ పోర్ట్ విభాగం ఆధ్వర్యంలో 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు పురస్కరించుకుని రోడ్డు రవాణా నియమ నిబంధనలు విధానాలు సంబంధించి నిర్వహించిన అవగాహన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎ. మోహన్, కాకినాడ ట్రాఫిక్ డిఎస్పి, పెద్దాపురం ఇంచార్జి డిఎస్పి మొగిలి వెంకటేశ్వరరావు, ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.సతీష్ రెడ్డి, ఇన్చార్జి ఆర్టిఓ సురేష్, కాకినాడ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బివి మురళి కృష్ణ, ముఖ్య అతిథులుగా విచ్చేసి డ్రైవర్లకు, విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందించారు. వాహనదారుల భద్రత, ప్రయాణికులు క్షేమం ధ్యేయంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని రవాణా శాఖ అధికారులు తెలిపారు. డాక్టర్ ఎంవి కిరణ్ కుమార్ (అపోలో-హాస్పిటల్), డాక్టర్ నవీన్ (మెడికవర్-హాస్పిటల్) మాట్లాడుతూ ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స గురించి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఎంతో ఆకట్టుకుంది. అనంతరం ఆదిత్య యాజమాన్యం తరపున ట్రాన్స్పోర్ట్ అధికారులను, డాక్టర్లను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య సిబ్బంది సిహెచ్ వెంకటరెడ్డి, సిపిఓ పి. కృష్ణ మూర్తి, ఏఓ ఎం. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించి యువకుడు మోసం చేశాడని ట్రాన్స్ జెండర్ ఆత్మహత్య

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ప్రేమించిన యువకుడు మోసం చేశాడని మనస్థాపంతో ట్రాన్స్ జెండర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజమహేంద్రవరంలో సంచలనం కలిగించింది. రాజమహేంద్రవరం సింహాచలం దగ్గరకు చెందిన మిద్దె ప్రణీత (29)ను సింహాచల నగర్ ప్రాంతానికి చెందిన పట్టా శ్రీను అనే వ్యక్తి గత ఆరు సంవత్సరాలుగా ప్రేమిస్తున్నాడు. ప్రణీతను వివాహం చేసుకుంటానని మోసం చేసి, ముఖం చాటు వేశాడు. దీనిపై ప్రణీత, శ్రీ ను ను నిలదీయడంతో నాకు సంబంధం లేదు. నీ చావు నువ్వు చావు అని హేళన చేయడంతో మనస్తాపం చెందిన ప్రణీత ఈనెల 19వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అపరస్మారక స్థితిలో ఉన్న ప్రణీతను హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తాడితోటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ సంఘటన తెలుసుకున్న ట్రాన్స్ జెండర్ సంఘాలు తాడితోటలోని ఆసుపత్రికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. ట్రాన్స్ జెండర్ మృతికి కారుకుడైన శ్రీను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనకు దళిత సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ ఆందోళనలో ట్రాన్స్ జెండర్ సంఘాల నాయకులు సోని, ఎస్ కే జరీనా, నందు ,జ్యోతి, దళిత సంఘాల నాయకులు పాము బాబురావు, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి రాజేంద్రప్రసాద్, బుర్ర చిన్ని ,దారా ఏసురత్నం ,వెంద్రపాటి వీర్రాజు, ఉసురుమర్తి రామారావు, ఎంపీడీ కృపావరం తదితరులు పాల్గొన్నారు.

వైరస్ సోకిన పశువులను వేరుగా ఉంచాలి

విశాలాంధ్ర - అనపర్తి : లంపి వైరస్ సోకిన పశువులను వేరుగా ఉంచాలని లేనియెడల మిగిలిన పశువులకు కూడా సోకే ప్రమాదం ఉందని వెటర్నరీ సర్జన్ డాక్టర్ సమత తెలిపారు. శనివారం కుతుకులూరులో లంపి స్కిన్ వ్యాధి బారిన పడ్డ పశువుల పరిస్థితిని డాక్టర్ సమతతో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సమత మాట్లాడుతూ లంపి వైరస్ ఎక్కువగా ఆవులకు సోకుతుందని శరీరంపై చిన్న చిన్న కంతులు, కాళ్ళ వాపు, తిండి మందగించడం, జ్వరం రావడం జరుగుతుందని తెలిపారు. ఈ వైరస్ కు ఎటువంటి వాక్సిన్ లేదని దీనికి యాంటీబయోటెక్ గా తమలపాకులు, మిరియాలు, బెల్లం పసుపు కలిపి పెడితే జ్వరం తగ్గేందుకు ఇంజక్షన్ ఇవ్వడం జరుగుతుందని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రిక్స్ యూనియన్ ప్రెసిడెంట్ నల్లమిల్లి నాగిరెడ్డి, అల్లక సత్తిబాబు, వెటర్నరీ అసిస్టెంట్ శిరీష ఉన్నారు.

ప్రతిభా పాఠవ పరీక్షలు



విశాలాంధ్ర - దేవరపల్లి : మండలంలోని అన్ని ఉన్నత పాఠశా లల విద్యార్థులకు పార్డ్ ఇండియా గౌరవ అధ్యక్షులు కారుమంచి గణేష్ సహకారంతో వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పార్డ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రతిభా పాఠవ పరీక్షలు నిర్వహిస్తున్నామని సామాజిక విశ్లేషకులు సుంకవల్లి సత్తిరాజు తెలిపారు. ఇప్పటికే మండలం లోని అన్ని హైస్కూళ్ళకు ప్రశ్నాపత్రాలను అందించామని, దేవరపల్లి,నల్లజర్ల మండలాల్లో ఉన్న ఉన్నత పాఠశాలల స్థాయిల్లోను,మండల స్థాయిల్లోను జరిగే పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు అందించడం జరుగుతుందని సత్తిరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలపై శిక్షణ

విశాలాంధ్ర - గోపాలపురం : నిరుద్యోగ యువతీ యువకులకు వృత్తి నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో ఆర్. శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం లో ఒక స్కిల్ హబ్ ను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గోపాలాపురం నియోజకవర్గంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫిట్టర్, ఫాబ్రికేషన్, కస్టమర్ రిలేషన్షిప్ నాన్ వాయిస్ కోర్సులలో శిక్షణా ఇవ్వనున్నారు.శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.ఈ కోర్సులలో చేరడానికి కనీస విద్యార్హతలు ఇంటర్ ఉతీర్ణులై లేదా ఆ పై చదువులు చదివి 19 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య వయసుగలవారు అర్హులన్నారు. ఆశక్తి కలిగి అర్హతలు కలిగిన స్థానిక నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన

జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత

విశాలాంధ్ర - రాజానగరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో అన్ని వసతులతో కూడిన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. మండలంలోని సంపత నగరంలోని జగనన్న గృహాలను కలెక్టర్ శనివారం పర్యటన చేశారు. దీనిలో భాగంగా పలువురు లబ్దిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అలాగే నూతనంగా నిర్మించిన జగనన్న గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా సొంత ఇంటిని కట్టుకోవాలంటే ఒకటికి నాలుగు సార్లు ఆలోచించి మాత్రమే ముందుకు వెళ్ళడం జరుగుతుందని,అయితే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా స్థలం ఇవ్వటమే కాకుండా, ఆ ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక చేయూతతో పాటుగా ఇసుక, సిమెంట్, ఐరన్, నీటి వనరులు ఆయా లే అవుట్ వద్ద గృహాలు నిర్మించుకునే లబ్దిదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. పేద లందరికీ సొంత ఇంటి కల సాకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు లో భాగంగా చేయూతను ఇస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట డిపివో జగదంబ,తహశీల్దార్ పవన్ కుమార్, హౌసింగ్ డీఈ జి.పరుశురాం, ఏఈ వి.వి.సత్యనారాయణ, ఎలక్ట్రికల్ ఏఈ పి.శ్రీనివాస్, ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ టి. సుబ్బారావు, సంపతనగరం, కొండగుంటూరు సర్పంచులు పెంటగట్ల రామకృష్ణ, ఉర్రింకల నాగలక్ష్మి శ్రీనివాస్, సంపతనగరం గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.వి.ఎస్.ఎన్.ఎం. గంగాధర్, పంచాయతీ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ పెద్దలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీపీఐ పోరుబాట

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : స్థానిక కొత్తపేట, రాజపేట ప్రాంతాల్లో జగనన్న కాలనీ అర్హులైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సిపిఐ బృందం కరపత్రాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి. కొండలరావు మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జగనన్న ఇళ్ల లబ్ధిదారులను కలిసి కరపత్రాలు పంపిణీ చేసి సంతకాలను సేకరించారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 1,80,000 కనీసం మట్టి ఖర్చులకు రావడంలేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. స్థలం ఇచ్చారు కానీ కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందింది అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హత కలిగిన వారికి ఇళ్ల స్థలాల మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు రమణమ్మ. ఎడ్ల లక్ష్మి. నల్ల రామారావు. బేగం. జిల్లా కార్యవర్గ సభ్యులు చింతలపూడి సునీల్ జట్లు సంఘం సభ్యులు ఆర్ వెంకట్రావు జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గృహనిర్మాణాలు

విశాలాంధ్ర - కాకినాడ : నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ళు పథకంలో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా కాంట్రాక్టర్లు, ఆయా ప్రభుత్వశాఖలు సమన్వయంతో పనిచేయాలని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం నగరపాలక సంస్థ, గృహనిర్మాణశాఖ, మెప్మా సిబ్బంది, కాంట్రాక్టర్లుతో గృహనిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ కొమరగిరి లేఅవుట్ రానున్న రోజుల్లో మంచి టౌన్షిప్గా అభివృద్ధి చెందబోతుందని చెప్పారు. అక్కడ ఇళ్ళు నిర్మించుకునే లబ్ధిదారులకు స్థానికంగా ఉపాధి అవకాశాలతోపాటు, లేఅవుట్లో సకల మౌళిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణం విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పనులు మరింత వేగవంతం అయ్యేలా ఆయాశాఖలు కాంట్రాక్టర్లకు తోడ్పాటును అందించాలని ఏడీసీ కోరారు. మే లోపు అగ్రిమెంట్లు చేసుకున్న లబ్ధిదారులందరికీ నిర్మాణాలు పూర్తి చేసి అప్పగించాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ డీఈ గుప్త, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో కృష్ణమోహన్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

34వ రోడ్డు భద్రతా వారోత్సవాలు

విశాలాంధ్ర - కాకినాడ/అమలాపురం : వాహన చోదకులు ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇచ్చేలా నియమ నిబంధనలుపై అవగాహన కల్పిం చేందుకై 34వ రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాపరావు తెలిపారు. శనివారం రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా అమలాపురం పట్టణంలో ఎర్ర వంతెన నుండి-నల్ల వంతెన-గడియార స్తంభం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ తిరిగి నల్లవంతెన వరకు రవాణా శాఖ అధికారులు పోలీసు అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించి రహదారి భద్రత నిబంధనలు నియమావళిపై ప్లే కార్డులు ప్రదర్శించి పట్టణంలో పురజనులకు రహదారి భద్రతపై అవగాహన పెంపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారుల ప్రయాణికుల పాదచారులు భద్రతపై ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నియమాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వాహనదారులకు రోడ్డు నిబంధనలపై సరైన అవగాహన లేకపో వడం, ఓవర్ స్పీడ్తో వాహనాలు నడపడంతో సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం, హెల్మెట్లు సీట్ బెల్ట్లు లేకుండా ప్రయాణించడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జరిగే వారోత్సవా ల్లో ప్రతి ఒక్కరూ రోడ్డు రహదారి భద్రత నిబంధనలు నియమావళి పై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలను సేవించి వాహనాలను నడపడం ద్వారానే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, కాశీ విశ్వేశ్వరరావు, రవికుమార్, డిఎస్పి మాధవరెడ్డి, సిఐ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం పరిశీలన

విశాలాంధ్ర - పిఠాపురం : స్థానికంగా నిర్వహిస్తున్న తధేకం ఫౌండేషన్ మహిళా కుట్టు మిషన్ కేంద్రంలో సుమారు 150 మంది మహిళలు టైలరింగ్ , ఎంబ్రాయి డింగ్ను జనసేన పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ మహిళా కోఆర్డినేటర్ చల్లా లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. తదేకం ఫౌండేషన్ ప్రతినిధులు మాధవి, సుధలు ఈ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం తమ సంస్థలో టైలరింగ్ నేర్చుకుంటున్న మహిళలకు ఆర్థిక సహాయం, సర్టిఫికెట్లను తమ చేతుల మీదుగా అందించారు.

జిల్లా గ్రంథాలయం అభివృద్ధికి కృషి

-జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా కలెక్టరు కృతికా శుక్లా కాకినాడ పట్టణం మెయిన్ రోడ్డులో ఉన్న జిల్లా గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. గ్రంథాలయానికి నిత్యం వచ్చే పాఠకులకు, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, దినపత్రికలు, పుస్తకాల వివరాలు, పుస్తకాల కొనుగోలు ప్రక్రియ విధి విధానాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దినపత్రికలు, పుస్తకం విభాగం, పోటీ పరీక్షలు తదితర విభాగాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షల విభాగంలో పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో కలెక్టరు మాట్లాడి పోటీ పరీక్షల వివరాలు, గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికా శుక్లా మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్నారు. పర్యటనలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.ఎల్.ఎన్.ఎస్.వి.ప్రసాద్, ఉప గ్రంథాలయాధికారి ఆర్.వి.రాము, దూలం వెంకన్నబాబు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాకినాడ నాగమల్లితోట ఆర్టీవో కార్యాలయం దగ్గరలో ఉన్న రెవెన్యూ అతిథి గృహం ఆధునికీకరణ పనులకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరు కృతికా శుక్లా.. రహదారులు, భవనాల శాఖ ఇంజనీర్లతో కలిసి రెవెన్యూ అతిథి గృహాన్ని తనిఖీ చేశారు. రెవెన్యూ భవనంలోని సదుపాయాలను పరిశీలించి, మార్పులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆధునికీకరణ పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టరు కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టరు వెంట రహదారులు, భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.హరిప్రసాద్ బాబు, కాకినాడ ఈఈ రమేష్ కుమార్, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

రూ.7,665 విలువైన సరుకు జప్తు

విశాలాంధ్ర - కాకినాడ : పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణా, రైస్ మిల్లులు, పెట్రోలు బంకులు తదితరాలు నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి శనివారం నిత్యవసరాల చట్టం-1955, సెక్షన్ 6ఏ కింద ఏడు కేసులను విచారించి, సీజ్ చేసిన రూ.7,665 విలువైన సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు కాకినాడ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఓ ప్రకటనలో తెలిపారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహన యజమానికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. వంట గ్యాస్ సిలిండర్ను వ్యాపార అవసరాలకు వినియోగించిన దుకాణ యజమానికి రూ. 6 వేలు జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఈ మొత్తం పౌర సరఫరాల ఖాతాకు జమవుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై నిత్యవసరాల చట్టం-1955, సెక్షన్ 6 ఏ ప్రకారం కేసులు నమోదు చేసి, జాయింట్ కలెక్టర్ వారి కోర్టు ముందుంచుతారు. కేసుల్లో ప్రతివాదులను జాయింట్ కలెక్టర్ విచారించి..తీసుకోవాల్సిన చర్యలకు, సీజ్ చేసిన సరుకులను ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు జారీచేస్తారు.

సంగమేశ్వర స్వామికి కన్నబాబు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కరప : కరపమండలం ఉప్పలంక గ్రామంలో వేంచేసి వున్న స్వయంభూ సంగమేశ్వర స్వామిని శనివారం కాకినాడ రూరల్ శాసనసభ్యులు మాజీ మంత్రి కురసాల కన్నబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదమంత్రాలతో విశేషంగా పూజలు జరిపి కన్నబాబుకు ఆశీర్వచనం అందించారు. అనంతరం కన్నబాబు మాట్లాడుతూ చొల్లంగి ఆలయం నందు వేంచేసి ఉన్న సంగమేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం హిందూ దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే ఎండోమెంట్ నిధులతో అనేక దేవాలయాలు అభివృద్ధి చేసామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మిడి నయోమి సతీష్, ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, జెడ్పీటీసీ యాళ్ళ సుబ్బారావు, ఎంపిటిసి కాలాడి కామేశ్వరరావు, సర్పంచ్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైనాట్ 175 సాధకులు మీరే

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : వచ్చే ఎన్నికల్లో వైనాట్ 175 సాధించడంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 5.2 లక్షల మంది గృహ సారథులే కీలక భూమిక పోషించ నున్నారని జేసీఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పుత్తా ప్రతాప్ రెడ్డి అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన సమావేశంలో హెూం మంత్రి తానేటి వనిత, వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైసీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా,రాజమహేంద్ర వరం ఎంపీ మార్గాని భరత్ రాం,అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు,రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ వివిధ నియోజకవర్గాల పరిశీలకులు జిల్లాలోని అన్ని మండలాల జేసీఎస్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజల మనసులను గెలుచుకోవడం ద్వారా వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం (వై నాట్ 175) సాధించడమే లక్ష్యంగా గృహ సారథుల వ్యవస్థ పనిచేస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. ప్రతీ వాలంటీర్ క్లస్టరులో పార్టీకి, ప్రజలకు మధ్య వారధులుగా గృహ సారథులు పనిచేస్తారని రాజా పేర్కొన్నారు.

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

దారవరంలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - చాగల్లు :గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్ర మంలో భాగంగా చాగల్లు మండలం దారవరం గ్రామంలో 81 వ రోజు హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా దారవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్ ను ఆమె ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ తిరిగి సీఎం జగన్ గారు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు శిక్షణ

విశాలాంధ్ర - తాళ్లపూడి : జగనన్న భూరక్ష పథకంలో భాగంగా తాళ్లపూడి మండలం లోని వేగేశ్వరరపురం లో అధికారులు రీ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామానికి సంబంధించి 1950 ఎకరాలు పంట పొలాలు, 185 ఎకరాలు గ్రామ కంఠం ఉన్నట్లు అంచనా. సర్వే బృందం శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి భారతి, కార్యదర్శి శ్రీనివాస్, నాగాంజనేయులు, గ్రామ రెవెన్యూ అధికారులు సంజీవ్, శ్రీను, ఉపసర్పంచ్ మదన్, డ్రోన్ ఫైలెట్స్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నియమాలు ప్రజల కోసమే

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ప్రభుత్వం ఏర్పాటుచేసే రహదారి నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు మన రక్షణ కోసం, మన కుటుంబాల క్షేమం కోసమే అని ప్రజలంతా తెలుసుకోవాలని రాజానగరం ఎమ్మెల్యే, వైసీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఏటా వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని, కుటుంబంలోని ఒక వ్యక్తి దూరమైనపుడు ఆయా కుటుంబాలు అనుభవించే బాధ, ఇబ్బందులు ఊహించలేమన్నారు. కేవలం కొన్ని సెకన్ల వ్యవధిలో జరిగే ఈ ఘోరాలను అరికట్టాలంటే, ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రాజమహేంద్రవరంలో రవాణా శాఖ అధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రవాణా శాఖ అధికారులు, పోలీస్ ఆధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - సీతానగరం: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభు త్వం వైసీపీ అని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో గల నాగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలో ఉన్న 540 ఇళ్లకు తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ జయకేతనం ఎగురవేసేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో కె.రమేష్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

నూతన విధానాలతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - గోపాలపురం : వ్యవసాయ సాగులో రైతులు నూతన విధానం పాటించి వరి నాట్లు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు తెలిపారు. జిల్లాలోని 18 మండలాల్లో ఒక్కో క్షేత్రాన్ని ఎంపిక చేసి ఈ నూతన వ్యవసాయ విధానాలను ప్రయోగం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ పద్ధతిలో నారుతో పని లేకుండా అడుగు వెడల్పు, పొడవుతో ధాన్యపు గింజలను దమ్ములో గుచ్చడం వలన మంచి దిగుబడులు సాధించడానికి మంచి ప్రయోగం చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి శనివారం గోపాలపురం మండలం, చేరుకుమిల్లి గ్రామంలో కాకర్ల సురేష్ అనే రైతు పోలంలో ఈ నూతన పద్ధతిపై శిక్షణ ఇచ్చినట్లు డీఎం తాతారావు తెలిపారు. ముందుగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పొలంలో ఆ రైతు పొలంలో మండలానికి ఎకరం చొప్పున ప్రయోగాత్మకంగా గింజలు నాటుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరావు, కృపావతి, ఎల్ 2 సురేష్, దుర్గాదేవి, రాజ్యలక్ష్మీ, కృష్ణ, దేవరపల్లి, గోపాలపురం మండలాలకు చెందిన ఐసిఆర్పీలు పాల్గొన్నారు.

ఐస్ స్కేటింగ్లో విజేతలకు అభినందన

విశాలాంధ్ర - కాకినాడ : ఈ నెల 3నుంచి 8వరకు జమ్మూకాశ్మీర్, గుల్మార్గ్ ఐస్స్కేటింగ్ రింక్లో నిర్వహించిన సీనియర్, జూనియర్, సబ్జూనియర్ జాతీయ కర్లింగ్ చాంపియన్షిప్లో కాకినాడ వాసులు పతకాలు సాధించారు. సీనియర్ విభాగంలో ఎం. తేజశ్రీ బంగారు పతకాన్ని సాధించగా సబ్జూనియర్ మిక్స్డ్ విభాగంలో ఎన్.శేషురిషిత్రెడ్డి, లక్ష్య ఇంటర్నేషనల్స్కూలుకు చెందిన ఎన్ అర్జున్, ఆశ్రమ్స్కూలు తరపున బి. నాగేంద్రనాథ్ కాంస్య పతకాలు సాధించారు. చలిని సైతం లెక్కచేయకుండా మన రాష్ట్రానికి పతకాలు సాధించిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన స్టేట్ కోచ్ సురేంద్రరెడ్డి, లోకల్ కోచ్ ఎస్హెచ్ఎస్బి కృష్ణను లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ ఎన్.సుగుణ అభినందించారు.

పాదయాత్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనాయకులు నారా లోకేష్ బాబు యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర 400ల రోజులు 4000 కిలోమీటర్లు 27 జనవరి కుప్పం నుంచి ప్రారంభం కాబోతున్న సందర్భంగా, లోకేష్ బాబు పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేయ్యాలని, కలియుగ దైవము వేంకటేశ్వరస్వామి వారి గుడి నందు కాకినాడ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తిరుమల కుమార్, ప్రధాన కార్యదర్శి చాపల లీల ప్రశాంతి, తెలుగు మహిళా కార్యకర్తలు కొబ్బరి కాయలు కొట్టి, పూజా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ & కాకినాడ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తిరుమలకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశపాలన వలన ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అందరికి తెలుసునన్నారు. లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని సుంకర పావని తిరుమల కుమార్ పిలుపు నిచ్చారు.

విశాలాంధ్ర

ఎర్ర కాలువ వెలుపలి గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం : మండల కేంద్రమైన టి నరసాపురం పంచాయతీలోని ఎర్రకాలువ వెలుపలి 6 గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రత్యేక పంచాయతీ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల యువ కులు పోలవరం నియోజకవర్గ శాసన సభ్యులు తెల్లం బాలరాజును శనివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేసి, ఆయా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలపై ఎంపీపి దారబోయిన లక్ష్మితో పాటు ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టినరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం, రుద్రకోటరాజు గూడెం, పుట్రేపు, ప్రకాష్ నగర్, కాపుగూడెం, రాజులగూడెం లను విడదీసి ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలన్నారు. అధ్వాన్నంగా ఉన్న పుట్రేపు, బండివారిగూడెం రోడ్డును అభివృద్ధి చేయాలని, కృష్ణాపురం గట్టు పై ఆక్రమణలను తొలగించి నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అర్జా సాగర్, భూక్యా వేణుగోపాల్, దారబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రకు సంఘీభావంగా టిఎన్ఎస్ఎఫ్ పాదయాత్ర

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : ఈనెల 27 నుండి లోకేష్ నిర్వహిస్తున్న యువ గళం పాదయాత్రకు సంఘీభావంగా శనివారం పట్టణంలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. కాకర్ల కాంప్లెక్స్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికీ పూలమాలలు వేసి మసీదు సెంటర్ మీదుగా బస్టాండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం వరకు సంఘీభావ పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్ మాట్లాడుతూ లోకేష్ బాబు యువత, విద్యార్థులు, నిరుద్యోగులు కి భరోసాగా, అండగా వారి కష్టాలు తెలుసుకోవడానికి చేస్తున్న యువగళం పాదయాత్రకు మద్దతుగా యువత, ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారన్నారు. యువగళం పాదయాత్రకు వైసీపీలో వణుకు పుడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి తూటుకుంట రాము, వార్డ్ కౌన్సిలర్లు నంబూరి రాజు, కరుటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి,మహిళా నాయకురాలు పగడం సౌభాగ్యవతి, రాష్ట్ర ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు, కార్యనిర్వాహక కార్యదర్శి పాతూరి అంబేద్కర్, బొబ్బర రాజుపాల్, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిషోర్, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు గాలి చైతన్య, ప్రధాన కార్యదర్శి నాయుడు పవన్, జగత్, జస్వంత్, జిల్లా నాయకులు పారేపల్లి పవన్, అర్జ వెంకటరత్నం,వేగి సిద్ధూ, తెలుగు యువత నాయకులు కోనేటి చంటి, చిట్టాపూరి దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టే యువ గళం పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ కొయ్యలగూడెంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వినాయకుని ఆలయం వద్ద పోలవరం నియోజకవర్గం టిడిపి కన్వీనర్ బోరగం శ్రీనివాసరావు చేతుల మీదుగా యువ గళం గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నిమ్మగడ్డ రవీంద్రనాథ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాదేవి, కన్నాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు గంటలయ్య, ఎంపీటీసీ సభ్యులు షేక్ బాజీ, కొయ్యలగూడెం పట్టణ ప్రధాన కార్యదర్శి పూలపల్లి వెంకటరావు, మండల మహిళా నాయకులు ఆకుల అరుణ, పెండ్యాల రమాదేవి, ముదునూరి ప్రసాద్ రాజు,ఒగిరాల రవి, మండల అనుబంధ కమిటీ సభ్యులు, పట్టణ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రజకులు చెరువులు కాపాడుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా లలో రజకులు రజక వృత్తి దారులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని కొన్ని గ్రామపంచాయతీలు జిల్లా పంచాయతీ ఆదేశాల ప్రకారం సంఘాలు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షులు చిల్లకలపల్లి కట్లయ్య అన్నారు. శనివారం గణపవరం మండలం మొయ్యేరు గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధవరపు పుల్లయ్య, నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా పులిదిండి వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షులుగా అంజురి సూరయ్య కార్యదర్శిగా దండేటి దండు కోశ్యాదికారిగా మీసాల నగవెంకట సత్యనారాయణ, సభ్యులుగా మీసాల ముసలయ్య, నందమూరి సత్యనారాయణ, పులిదిండి సత్యనారాయణను ఎన్నుకున్నారు.

సుభాషిణి మృతికి సంతాపం

విశాలాంధ్ర- వీరవాసరం: సుభాషిణి మృతి తీరని లోటని భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. మండల జనసేన పార్టీ నాయకులు కే.వి.ఎల్ భార్య సుభాషిణి అనారోగ్యంతో గత గురువారం రాత్రి మృతి చెందారు. ఈ సందర్భంగా కెవిఎల్ ని శనివారం ఆయన పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుతూ కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. అంజిబాబు వెంట మత్యపురి గ్రామ టీడీపి అధ్యక్షుడు చింతా కనకయ్య, గ్రామ మాజీ సర్పంచ్ పిప్పళ్ల నాని, ఇతర నాయకులు ఉన్నారు.

ప్రతి కార్యకర్త ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: ప్రతి కార్యకర్త ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాల మేరకు బంధంచర్ల గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ అద్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో వున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి, బిసి సెల్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండపల్లి రవి ,మాజీ సొసైటీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ, అచంట సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అచంట అనీల్ కుమార్, గ్రామపార్టీ అధ్యక్షులు కాసనేని మాధవరావు ,ఘంటా సతీష్ ,ఒబిళ్ళనేని శ్రీను ,కొండ ,మారుమూడి పుణ్యేశ్వరరావు ,గుండె రామారావు, ఘంటా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ ఆలయంలో చండీహోమం

విశాలాంధ్ర - ఆకివీడు : ఆకివీడు గ్రామ దేవత శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం చండీ హెూమం నిర్వహించారు. ఈనెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణ మహెూత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా చండీ హెూమం నిర్వహించారు. వార్షిక కళ్యాణ మహెూత్సవాలు ఎటువంటి ఆటంకం లేకుండా జరగాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఆలయ అర్చకులు,మొవ్వా పట్టాభిరామయ్య, మొవ్వా ప్రభాకర్, మొవ్వా చందు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి విశిష్ట పూజలు నిర్వహించారు.

ఉగాది నాటికి 5 లక్షల గృహ ప్రవేశాలు ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : వచ్చే ఉగాది నాటికి 5 లక్షల జగనన్న ఇళ్ళలోకి గృహ ప్రవేశం చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని దానికి అనుగుణంగా గృహ నిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ నిర్మాణాలు వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్ అన్నారు. శనివారం మండలంలోని పెదతాడేపల్లి, మెట్ట ఉప్పరగూడెం, పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడులోని జగనన్న కాలనీలను పరిశీలించి మౌళిక వసతులు ఆర్థికపరమైన ఇబ్బందులు తదితర అంశాలపై లబ్ధిదారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పూర్తవుతున్న తమకు రావలసిన బిల్లులు సక్రమంగా రావడంలేదని, సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉ న్నాయంటూ, మౌళిక వసతులు సక్రమంగా లేకపోవడం వల్ల నిర్మాణాలు చేసుకోలేకపోతున్నామని తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రావత్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు చేసుకునే విధంగా లబ్ధిదారులను అన్ని విధాల అధికారులు ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారంపై పూర్తి స్థాయిలో వాలంటీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సహకారంతో వివరించాలన్నారు. నిర్మాణ పనులను మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. వచ్చే ఉగాది నాటికి నిర్మాణాలు చేసు కుంటున్న లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసే విధంగా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్షేత్ర స్థాయి గృహ నిర్మాణాలు చేసుకునే వారికి మొబైల్ నెంబర్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సాంకేతికపరమైన సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించే విధంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి రామరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణ, డి.ఇ. కె.వి.వి. ప్రసాద్, ఎంపిడిఓ వెంకటేష్, పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం, సెక్రటరీ రవిచంద్ర, ఎ.ఇ.లు, ఇంజినీరింగ్ అసి స్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం : విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. టిబిఆర్ (తెల్లం బాల రాజు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 5రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా పోటీలను క్రీడా జ్యోతిని వెలిగించి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులలోని ప్రతిభను వెలికితీసేందుకు మండల, గ్రామీణ స్థాయిలలో కూడా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ క్రీడాపోటీలలో అత్యుతమ ప్రతిభ కనపరిచిన వారికి శిక్షణ అందించి వారిని అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక శాసనసభ్యులు ప్రతీ సంవత్సరం తన ఫౌండేషన్ ద్వారా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శాసనసభ్యులు తెల్లం బాలరాజు మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. గిరిజన ప్రాంతాలలోని యువతలో దాగిఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం రూ.42 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. రూ.21. 80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పోలవరం కరా టం సీతాదేవి, ఎంపీపీ కారం శాంతి రమణ, జెడ్పీటీసీ మొడియం రామ తులసి, సర్పంచి టి. వెంకయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలు నూరు శాతం పూర్తి చేయాలి

విశాలాంధ్ర -భీమవరం : భూహక్కు పత్రాలు నూటికి నూరు శాతం ఈ కేవైసీ పూర్తి చేయాలని జిల్లా జాయింటు కలెక్టరు జేవీ మురళి ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో జిల్లా జాయింటు కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ళ పట్టాలు తీసుకొని ఇల్లు కట్టుటకు నిరాకరిస్తున్న పట్టాదారుల వివరాలు లేఔట్ వారీగా సేకరించాలని, అందుకు గల కారణాలను ఆర్డీవో, సబ్ కలెక్టరు హౌసింగ్ ఈఈ ల ఆధ్వర్యంలో టీమ్లు ఏర్పాటు చేసి ఒక వారంలో నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ఎంపీ ఎఫ్సి, ఏ ఏమ్ సి యుల నిర్మాణాల కొరకు సేకరించిన భూములను వెంటనే ప్రతిపాదనలు పంపించాలని ఆయన ఆదేశించారు. అర్హులైన నవరత్నాల లబ్ధిదారులకు భూసేకరణ చేసి వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సూచించారు. స్మశాన వాటికలకు భూములను గుర్తించాలని జిల్లా జాయింటు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టరు ఎం. సూర్య తేజ, ఆర్డీవో దాసి రాజు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గౌడ సంఘ కార్యదర్శిగా శనగన శ్రీనివాస్ గౌడ్

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : రాష్ట్ర గౌడ్ సంఘ కార్యదర్శిగా నందమూరు గ్రామానికి చెందిన శనగనశ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. శనివారం రాష్ట్ర గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏలూరులో కార్యవర్గ సమావేశం జరిగింది. గతంలో శ్రీనివాస్ గౌడ్ తాడేపల్లిగూడెం మార్కెట్ యార్డ్ కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. టిడిపి మండల నాయకులుగా పనిచేశారు. గౌడ సంఘం తరపున తాడేపల్లిగూడెం మండలం, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పలు పదవులు నిర్వహించారు.ఈ సందర్భంగా శనగన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నాకు అప్పగించిన ఈ పదవీ బాధ్యతలను అత్యంత బాధ్యతయుతంగా నిర్వర్తిస్తానని తెలిపారు.గౌడ సంఘం తరపున గౌడ కుటుంబాల అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ కు పలువురు మిత్రులు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో రాజకీయపరంగా గాని గౌడ సంఘ పరంగా గాని మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మట్టా రామకృష్ణ, చిటకన శ్రీనివాసరావు, అత్తిలి బాబి, వాకా నాని, తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలు అందరికీ చేరాలి

విశాలాంధ్ర- ముసునూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నవరత్నాలు గ్రామస్థాయిలో అందరికి అందేలా చర్యలు చేపట్టాలని ముసునూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.రాణి అన్నారు. శనివారం మండ లంలోని ముసునూరు, చక్కపల్లి, గుళ్లపూడి, బలివే, గోపవరం, చింతలవల్లి ,లోపూడి గ్రామాల్లో ఆయా గ్రామాల సచివాలయం సిబ్బందితో పాటు వాలంటీర్లతో కలిసి ప్రభుత్వం అందించే పథకాలు అందరికి అందాలని వివరించారు.

జనసేన సాయం

విశాలాంధ్ర - ఉండి : ఉండి మండలం ఉప్పులూరు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంతో తాటాకిల్లు దగ్ధమై నిరాశ్రయులుగా మారిన కుటుంబాలకు జనసేన పార్టీ తరఫున జనసేన ఉండి నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగా నాగరాజు ఆధ్వర్యంలో జన సైనికుల సహాయంతో బాధిత కుటుంబాలకు శనివారం 37,500 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన బాధితులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉండి మండల అధ్యక్షులు యాడ వల్లి వెంకటేశ్వరరావు, ఉప్పులూరు జనసేన గ్రామ సర్పంచ్ యర్ర దుర్గారావు, బద్ది వెంకట సత్యనారాయణ, సత్యనారాయణమూర్తి, పోలిశెట్టి బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 108 ఉద్యోగుల రిలే దీక్షలు

విశాలాంధ్ర - కాకినాడ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు అనుబంధ 108 కాంట్రాక్టు ఎంప్లాయిస్ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా శనివారం కాకినాడ కలెక్టరేట్ సమీపంలో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. యూనియన్ నాయకులు పెంకే రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జీ మాట్లాడుతూ 108 సేవలకు ప్రపంచ వ్యాప్తంగానే గుర్తింపు ఉందన్నారు. శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ నియామకాలు తగవన్నారు. ప్రజల ప్రాణాల రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న 108 ఉద్యోగులకు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా 108 సేవలు గురించి గొప్పగా చెప్పుకుంటున్నారని తెలిపారు. ఉద్యోగులకు 3 రకాలుగా జీతాలు చెల్లించడం తగదని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తోందన్నారు. ఎల్ఎన్వి సత్యనారాయణ, డిఎన్ ప్రసాద్, వి. ప్రసాద్ బాబు, ఎస్. స్వాతి, ఎం. సుధారాణి దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగుల నాయకులు పెంకే రమణ, వివివి సత్యనారాయణ, ఎస్. నాగేశ్వరరావు, ఎస్. వినోద్ కుమార్, ఎం. సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు. కెఎంసి క్లాప్ డ్రైవర్స్ యూనియన్ కోశాధికారి టి. గంగాధర్ సంఘీభావం తెలిపారు.

ముగిసిన కానిస్టేబుల్ పరీక్షకు శిక్షణ

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్లపూడి మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన 35 రోజుల ఎస్.ఐ మరియు కానిస్టేబుల్ పరీక్ష కొరకు ఉచిత శిక్షణ కార్యక్రమం శనివారంతో పూర్తయ్యిందని అధ్యక్షులు జోడాల తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థుల అందరికి శుభాకాంక్షలు తెలియజేసారు. ప్రతీ ఒక్కరు ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణులు అవ్వాలని జోడాల అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కరిబండి సుబ్బారావు మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మురళి విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు. శిక్షకుడు శ్రీధర్ మాట్లాడుతూ ఇంత కష్టంతో కూడుకున్న శిక్షణ కార్యక్రమం విజయవంతం చేయుటలో జోడాల వెంకటేశ్వర రావు అభినందనీయులన్నారు. రీజినల్ చైర్మన్ వాసుబోయిన చంద్రయ్య, ట్రెజరర్ చెరుకు ఆంజనేయులు, పూర్వ అధ్యక్షులు అప్పన చంద్ర ధర గుప్త మాట్లాడుతూ విద్యార్థులందరు విజయం సాధిస్తేనే సంస్థ కష్టానికి ప్రతిఫలం దొరుకుతుంది అని అన్నారు. విద్యార్థులు, టీచర్స్ పాల్గొన్నారు.

కష్టించి పనిచేసే నాయకులకు గుర్తింపు

విశాలాంధ్ర - గోపాలపురం : కష్టించి పనిచేసే నాయకులకు వైకాపా ప్రభుత్వంలో గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర అతి రాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 19 ఉప కులాలలో 1, లక్ష 75 వేల మంది అతిరాసులు వారి ఉప కులాలు ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో గుర్తింపు లేని అతి రాశులను గూర్చి దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జరిపిన పాదయాత్రలో అతి రాశులను గూర్చి విన్నవించగా అధికారంలోకి వచ్చిన వెంటనే అతి రాశులను గుర్తించిన బీసీలలో చేర్చిన ఘనత రాజశేఖర్ రెడ్డి కి దక్కుతుందన్నారు.అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో తమ కులాల అభివృద్ధి కొరకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానికి చైర్మన్ గా నియమించారని గుర్తు చేశారు. రెండు ఏళ్ల పదవీకాలం ముగిసిన అనంతరం మరలా తన సేవలను గుర్తించి మరొక రెండు సంవత్సరాల పాటు తన పదవీ కాలాన్ని పొడిగించడం హర్షనీయమన్నారు. తన పదవి కొనసాగింపుకు కృషిచేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, బీసీ మంత్రి వేణుగోపాల్, తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జి మిధున్ రెడ్డికి,ఎంపీ. భరత్ రామ్ కు ఎమ్మెల్యే తలారి వెంకటరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధితో స్వర్ణ యుగం

విశాలాంధ్ర - నిడమర్రు : రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధితో స్వర్ణయుగంగా జగనన్న పాలన కొనసాగు తోందని, ఇచ్చిన హామీలు నెర వేర్చడంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు .శనివారం నిడమర్రు మండలం,బువ్వనపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి పథకాల అమలును వివరిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజలతో మమేకమవుతూ పథకాలను వివరిస్తూ ముందుకు వెళ్లారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కోడే కాశీ, ఎంపీపీ దనుకొండ ఆదిలక్ష్మి, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, మండల పార్టీ కన్వీనర్ సంకు సత్యకుమార్, ఎంపీడీవో పివివి ప్రకాష్, వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూరుశాతం పన్ను వసూళ్లే లక్ష్యం

విశాలాంధ్ర, విజయవాడ : ఎన్టీఆర్ జిల్లా నందిగామ, విజయవాడ, తిరువూరు డివిజన్ల పరిధిలోని వత్సవాయి, మైలవరం, కంచికచర్ల, వీరులపాడు, రెడ్డిగూడెం మండలాల పంచాయతీలలో పన్ను వసూళ్లు వేగవంతం చేసినట్టు డివిజనల్ పంచాయతీ అధికారి కళ్లేపల్లి పూర్ణచంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో డివిజన్ పరిధిలో పన్ను వసూళ్ల డిమాండ్ మొత్తం రూ.38 కోట్ల 14 లక్షల 78 వేలు కాగా, శుక్రవారం వరకు పన్నుల రూపంలో వసూలు చేసిన మొత్తం 15 కోట్ల, 70 లక్షల 86 వేలు అని చెప్పారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర - భీమవరం : ఫిబ్రవరి 11 న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ పై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించేందుకు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్యానల్ లాయర్ బి. సునీల్ కుమార్ అధ్యక్షతన భీమవరం మండలం వెంప గ్రామ సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ న్యాయ సేవాధికార చట్టం ప్రకారం తక్కువ సమయంలో సమ న్యాయం పొందే అవకాశం ఒక్క లోక్ అదాలత్ ద్వారానే సాధ్యం అన్నారు. వచ్చేనెల 11 న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను భీమవరంలోని ఆయా కోర్టులలో పెండింగ్ లో ఉన్న రాజీపడతగిన క్రిమినల్ కేసులలో ఉన్న , సివిల్ కేసులలో ఉన్న కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయవాదులు ఎస్.రమేష్,ఎస్. సుధీర్, పి ఎల్ వి కమల్ రాజు, సర్పంచ్ రాజేశ్వరి, సెక్రెటరీ మోహన కృష్ణ,విఆర్ఓ ముత్యాలరావు, ఎంపీటీసీ కుమార్ వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

నత్తే నయం

హైవే విస్తరణ పనులతో తప్పని పాట్లు
తాగునీటి సమస్యతో పాటు మురుగునీటి కష్టాలు

విశాలాంధ్ర-మండవల్లి: జాతీయరహదారి 165 విస్తరణ పనులు నత్త నడకన సాగుతున్నాయని అభివృద్ధి పనుల పేరుతో తాగునీటికి సైతం పాట్లు పడాల్సి వడాల్సివస్తుందని మండ వల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండవల్లి గ్రామంలో విస్తరణ పనులు చేపట్టి రెండు నెలలు గడుస్తున్నా డ్రైన్‌ల నిర్మాణాలు పూర్తికాలేదని మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తుందని డ్రైన్‌ల నిర్మాణ సమయంలో తవ్వకాలతో తాగునీటిపైపులైన్లు ధ్వంసం అవుతుండటంతో రోజుల తరబడి తాగునీరు రావటం లేదని మండవల్లి ప్రజలు ఆరోపిస్తున్నారు. విస్తరణ పనుల సమయంలో స్థానిక పంచాయితీ అధికారుల సూచనలు పాటించకుండానే కొత్తగా పైపులైన్లు వేస్తున్నారని పగిలిన తాగునీటి పైపులైన్లకు మరామ్మతులు చేపట్టం లేదని మండవల్లి వాసులు వాపోతున్నారు. పిహెచ్‌సి సమీపంలోని నివాససముదాయాలకు గత కొద్ది రోజులుగా తాగునీరు సరఫరా లేదని వెంటనే పైపులైన్లకు మరామ్మత్తులు చేపట్టాలని విస్తరణ పనులతో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని ఐక్యవేదిక నాయకులు శనివారం స్పందనలో మండవల్లి ఈవో టి.శ్రీనివాసరావుకు అర్జీ అందించారు.

ఎమ్మెల్యే రాజాకు బూత్ కమిటీ అధ్యక్షుడి కృతజ్ఞతలు

విశాలాంధ్ర - సీతానగరం: రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గారికి కృత్ఞతలు తెలిపిన నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు గద్దే వెంకటకృష్ణ చౌదరి. దీనిలో భాగంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు పుష్ప గుత్యం ఇచ్చి ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా గద్దే వెంకటకృష్ణ చౌదరి (నల్లి) మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో తనకు అప్పగించిన పదవిని సమర్ధవంతంగా నిర్వహిస్తానని రాబోయే రోజుల్లో రాజానగరం నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం బలోపేతానికి మరింత కృషి చేస్తానని అన్నారు. అలగే 2024 ఎన్నికలో జక్కంపూడి రాజాను అత్యధిక మెజార్టీతో విజయం సాధించే వరకు అహర్నిశలు పార్టీ కోసం కష్ట పడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జ్యోత్స్న, కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, వీరబాబు, నగేష్ మొదలగు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఈ నెల 25వ తేదీన 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామని, ఓటు ప్రాముఖ్యతపై అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం తెలిపారు. జనవరి 25న కేంద్ర ఎన్నికల సంఘంను స్థాపించిన రోజును గుర్తుచేసు కుంటూ 2011లో తొలిసారిగా జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకున్నామన్నారు. ఓటుకు మించింది లేదు, నేను కచ్చితంగా ఓటు వేస్తాను" థీమ్ తో ఈ సంవత్సరం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవంను జరుపుకొనేలా భారత ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు. ఓటు ప్రాముఖ్యతను తెలుసుకొనేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజాస్వామ్యం, ఎన్నికలపై యువతీ యువకుల్లో బాధ్యతను గుర్తుచేయడం, 18 ఏళ్లు దాటిన వారిని ఓటు వేసేలా ప్రోత్సహించేందుకు ఏటా జనవరి 25న జరుపుకుంటున్నదే జాతీయ ఓటర్ల దినోత్సవం అని పేర్కొన్నారు. ప్రజల్లో, విద్యార్థుల్లో ఓటు హక్కు పై అవగాహన కల్పించడానికి ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయించ డంతో పాటు వారికి ఎలెక్టోరల్ ఫోటో ఐడెం టిటీ కార్డులను అందజేయాలని ఎన్నికల నమోదు అధికారులకు సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ఓటు ప్రాముఖ్యతపై విద్యాసంస్థలు అవగాహన కల్పించాలన్నారు. వృద్ధ ఓటర్లను గుర్తించి సన్మానించాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో వారి పాత్రను యువతకు తెలియజేసేలా అధికారులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటర్ల దినోత్సవం రోజున ప్రతిజ్ఞ చేయడం, సాధార ప్రజలు, విద్యార్థులు ర్యాలీ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ట్యాక్స్ తగ్గించకపోతే వేరే రాష్ట్రానికి వెళ్తాం

విశాలాంధ్ర-గుడివాడ : రాష్ట్ర ప్రభుత్వం లారీ ఓనర్స్‌పై విపరతంగా ట్యాక్స్‌లు పెంచడం వల్ల లారీలను నడపలేని పరిస్థితిలో ఉన్నమాని వెంటనే పెంచిన ట్యాక్స్‌లను తగ్గిసారా లేక వేరే రాష్ట్రనికి తరలిపోమటారో తెలపాలని పట్టణ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శిలు గుత్తా శివరామకృష్ణ(చంటి), ఆర్.బి.ఆర్ ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. శనివారం పెంచిన ట్యాక్స్‌లు, డీజీల్ ధరలను తగ్గించాలని కోరుతు పట్టణంలో ది లారీ ఓనర్స్ అసోసిచేషన్ అధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా లారీల పరిస్థితి పూర్తిగా దెబ్బతిందన్నారు. మన రాష్ట్రంలో రోడ్లు పూర్తిగా ధ్వంసమైనా పట్టించుకునే నాధుడే లేడన్నారు. ప్రభుత్వం గతంలో రూ.200 ఉండే గ్రీన్ ట్యాక్స్‌ను నేడు రూ.1350లు చేయలని చూడడం దారుణమన్నారు. ఇతర రాష్ట్రలో తక్కువ ధరకు వస్తున్న అయిలు రేట్లు మన రాష్ట్రంలో విఫరితంగా పెరిగిపోయన్నారు. క్వాటర్, 2క్వాటర్ ట్యాక్స్‌లను ఇష్టాను సారంగా పెంచడం వల్ల లారీలు నడపలేని పరిస్థితి వచ్చిందన్నారు. తోలుతలారీ ఓనర్లు, డైవర్లు, సిబ్బంది లారీ స్టాండు నుండి నెహ్రుచౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రవాణశాఖ కార్యలయం వద్దకు నిరసనగా వెళ్ళి ఆర్‌టిఓకు విన్నత పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అడుసుమిల్లి శ్రీనివాసరావు, గొళ్ళ శివా, మెరుగుమాల రామకృష్ణ, కల్యాణ్, ఇరఫాన్, ఓనర్లు, డైవర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.